క్లుప్తంగా

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ట



ఆలయ ప్రతిష్ట వేడుకల్లో ప్రజాప్రతినిధులు

చీపురుపల్లి: మండలంలోని కర్లాం పంచాయతీ పరిధిలోని మోదుగులపేట గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర, ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, సర్పంచ్ బాణాన భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ బాణాన రమణమ్మ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నియామక పత్రాలు అందజేత



నియామక పత్రాలు అందజేస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

చీపురుపల్లి: మేజర్ పంచాయతీలో నూతనంగా నియమితులైన పది మంది ఆశా వర్కర్లకు డీఎంహెచ్ఓ భాస్కరరావు గురువారం నియామక పత్రాలను అందజేశారు. కర్లాం పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డా.సువర్ణ, మేజర్ పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి శ్రీనివాసరావుతో కలిసి ఆశా వర్కర్లకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ఆశా వర్కర్లు తమ పరిధిలో ఉన్న గర్భిణీలు, బాలింతలు సమాచారం సేకరించడం మాత్రమే కాకుండా ఎప్పటికప్పుడు హెల్త్ నివేదికలను మెడికల్ ఆఫీసర్‌కు అందజేయాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ ఎల్.అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

క్రీడాకారుడికి జేసీ అభినందన



పవన్‌ను అభినందిస్తున్న జేసీ కార్తీక్

జామి: ఇటీవల నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల్లో అలమండ గ్రామానికి చెందిన పవన్ క్రికెట్‌లో సత్తా చాటడంతో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు దత్తత తీసుకుంది. ఈ నేపథ్యంలో జేసీ కె.కార్తీక్ తన ఛాంబర్‌లో గురువారం పవన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. క్రికెట్‌లో రాణించాలని, జాతీయ జట్టులో స్థానం సంపాదించాలని ఆంకాక్షించారు.

నిరసన



స్థానిక ఆస్పత్రి వద్ద నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

గజపతినగరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎన్జీఓ తాలూకా సంఘం అధ్యక్షుడు కె.పైడన్న డిమాండ్ చేశారు. ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి స్థానిక ఏరియా ఆస్పత్రి ఆవరణలో నిరసన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీతో పాటు ఐఆర్ ఇవ్వాలని, సకాలంలో జీతాలు పడేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెన్షన్‌దారులకు పూర్తి స్థాయిలో చెల్లింపులు చేయాలని కోరారు.

వాటర్ ట్యాంక్ పరిశుభ్రం



బ్లీచింగ్ ద్రావణం కలుపుతున్న సర్పంచ్ వెంకటరావు, గ్రీన్ అంబాసిడర్లు

వేపాడ: మండలంలో శింగరాయి గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ట్యాంక్‌ను గురువారం శుభ్రం చేశారు. సర్పంచ్ నిరుజోగి వెంకటరావు గ్రీన్ అంబాసిడర్లతో ట్యాంకును శుభ్రం చేయించారు. గ్రామస్తులకు సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో ట్యాంకును శుభ్రం చేయించినట్లు సర్పంచ్ తెలిపారు. ప్రజలు వారంలో ఒకరోజు డ్రై డేగా పాటించాలని కోరారు. ఇళ్లలోని చెత్తను రోడ్డుపై పారబోయకుండా చెత్త సేకరణకు వచ్చే గ్రీన్‌అంబాసిడర్లకు అందివ్వాలని సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

కష్టనష్టాల్లో మీకు అండగా ఉంటా..

- రానున్న ఎన్నికల్లో మీరంతా వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలి
- 'గ్రామ సందర్శన'లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



రేవళ్లపాలెంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: మీ కష్టనష్టాల్లో భాగస్వామిని నేను. నిరంతరం మీ మధ్యనే ఉంటా. మీతోనే నా రాజకీయ ప్రస్థానం కొనసాగుతుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. 'గ్రామ సందర్శన' కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం మండలంలోని రేవళ్లపాలెం గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. ముందుగా కొట్టాం గ్రామంలో కొలువైన కోటమ్మతల్లిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రేవళ్లపాలెంలో పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. నవరత్న పథకాలతో ప్రతి కుటుంబానికి అండగా నిలిచారని, నాడు–నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆస్పత్రులను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటుతో గ్రామ స్థాయిలోనే మెరుగైన ప్రభుత్వ సేవలు, వైద్య సేవలు అందుతున్నాయన్నారు. పిల్లల చదువులకు అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, మహిళలకు చేయూత, ఆసరా, రైతులకు రైతుభరోసా, ఇలా అన్ని వర్గాల వారికి మేలు జరిగేలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. వేలాది మంది నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేశారని, పింఛన్లను రూ.3 వేలకు పెంచడం జరిగిందన్నారు. మీ కోసం ఇన్ని మంచిపనులు చేసిన జగనన్నను రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మీఅందరిపై ఉందన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్న రుణం తీర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, స్టేట్ ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, వైస్ ఎంపీపీ పి.వెంకటరమణ, ఎస్.కోట పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ రహ్మాన్, ఎంపీటీసీ చప్ప లత, భాస్కర్, పోతనాపల్లి సర్పంచ్ కె.వెంకటరావు, జేసీఎస్ ఇన్‌చార్జ్ వి.సతీష్, ఎస్.చంద్రరావు, మోడి కాశీ విశ్వనాథం, మమ్ములూరి సోంబాబు, పి.జగదీష్, డి.పార్వతి, కె.జయశంకర్, ఎం.శంకర్, అప్పలసత్యం, నాగరాజు, సి.హెచ్.రమణ, పి.ధర్మారావు, ఆవాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామాలయం ప్రారంభోత్సవం



స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



స్వామివారిని దర్శించుకున్న మజ్జి సిరిసహస్ర, జెడ్పీటీసీ శ్రీదేవి

కొత్తవలస: మండలంలోని గులివిందాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయ ప్రారంభోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. గ్రామ పురోహితులు వెలవల లక్ష్మీ శ్రీనివాసరావు, పి.జయసాయికుమార్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య మూడు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. గురువారం మండల ఆరాధన, అంగ, కరన్యాసాలు, శిఖర ప్రతిష్ట, యంత్రప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరై స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే చిన్నశ్రీను సోల్జర్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామ సర్పంచ్ గవర ఇందిరప్రియదర్శిని, గణేష్ దంపతులు ప్రత్యేక పూజాలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీలు, వైఎస్సార్‌సీపీ నాయుకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల మంజూరు

దత్తిరాజేరు: మండలంలోని టి.భూర్జవలస గ్రామంలో శివాలయం నిర్మాణానికి టీటీడీ నుంచి రూ.10 లక్షలు మంజూరైనట్లు వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు గురువారం తెలిపారు. ఆలయ నిర్మాణానికి గ్రామ పెద్దలంతా కలిసి భూమిపూజ చేశారు. త్వరలో ఆలయ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.

నిబంధనల మేరకు పనులు చేపట్టాలి



జి.పి.అగ్రహారంలో మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: నిబంధనల ప్రకారం ఉపాధి పనులు చేస్తే గిట్టుబాటు వేతనం లభిస్తుందని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు అన్నారు. మండలంలోని జి.పి.అగ్రహారం గ్రామంలో చేపట్టిన ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. వేతనదారుల మస్టర్లను తనిఖీ చేశారు. జాబ్‌కార్డు ఉన్నవారు మాత్రమే పనులకు రావాలని, ఒకరికి బదులు మరొకలు పనులకు రావొద్దని సూచించారు. పని ప్రదేశంలో నీడ, తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉండేలా చూడాలని క్షేత్రసహాయకులకు సూచించారు.

సోమలింగాపురంలో రథసప్తమి వేడుకలు

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం గ్రామంలో వెలసిన శ్రీసూర్యనారాయణ మూర్తిస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను ఆలయ అనువంశిక ధర్మకర్త డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆరవెల్లి కృష్ణశాస్త్రి, ఆరవెల్లి శ్రీనివాసశాస్త్రి ఆధ్వర్యంలో వేకువజామున 5 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం స్వామివారికి పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు.

నేడు గరుడుబిల్లిలో వైద్యశిబిరం

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి గ్రామంలో శుక్రవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష–2' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ చల్లా చలంనాయుడు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామ సచివాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సచివాలయం పరిధిలోని ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

100 రోజుల పనిదినాలు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎం.పావని, ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్రకుమార్

మెరకముడిదాం: మండలంలో వంద రోజుల పనిదినాలు పూర్తికాని వేతనదారులకు పూర్తిస్థాయిలో పనులు కల్పించాలని ఎంపీడీఓ ఎం.పావని సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి క్షేత్రసహాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఫారం పాండ్స్‌పై క్షేత్రసహాయకులు దృష్టిసారించాలన్నారు. ఉద్యాన పంటలు సాగుచేసేలా రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ఆ దిశగా వారిని ప్రోత్సహించాలన్నారు. ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. జాబ్ కార్డు ఉన్న ప్రతీ వేతనదారుకు పని కల్పించాలని, గరిష్ట వేతనం వచ్చేలా కొలతలు నిర్దేశించాలని, మస్టర్లలో దిద్దుబాట్లు ఉండరాదని సూచించారు. సమావేశంలో పలువురు టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న బెల్లాన వంశీకృష్ణ

చీపురుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో లంచాలు తీసుకుని సంక్షేమ పథకాలు ఇచ్చేవారన్నారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి తిరుమల, ముల్లు పైడిరాజు, కింతలి మధు, సతివాడ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపిక



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న అధికారులు

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట సమీపంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని తయారు చేసిన 'బయో బ్యాగ్స్' ప్రాజెక్టు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యు.విజయ్‌కుమార్‌పాత్రో గురువారం తెలిపారు. పాఠశాలకు చెందిన జి.పూజిత గైడ్ టీచర్ జి.ఇంద్రజ పర్యవేక్షణలో అరటి దవ్వలతో సంచుల తయారీపై రూపొందించిన ప్రాజెక్టు ఇప్పటికే జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రాజెక్టుగా నిలిచింది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడంతో విద్యార్థినిని, గైడ్ టీచర్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



కరకవలసలో విద్యార్థుల వర్కుబుక్స్ పరిశీలిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ బాలభాస్కరరావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని జాకేరు ప్రాథమికోన్నత పాఠశాల, కరకవలస ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. తరగదులకు వెళ్లి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. గణితం, ఆంగ్ల పదాలను బోధించారు. వర్క్‌బుక్స్‌ను పరిశీలించి దస్తూరీ మెరుగుపర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట సీఆర్పీలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభం

దత్తిరాజేరు: పోరలి గ్రామంలో రూ.80 లక్షలతో నిర్మించిన ప్రభుత్వ భవనాలను ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య చేతుల మీదుగా శుక్రవారం ఉదయం ప్రారంభించనున్నట్లు వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, సర్పంచ్ ధనలక్ష్మి గురువారం తెలిపారు. రూ.42 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.20 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.18 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

నేడు కోఆపరేటివ్ బ్యాంక్ ప్రారంభం

దత్తిరాజేరు: మండల కేంద్రమైన దత్తిరాజేరులో నూతనంగా ఏర్పాటుచేసిన కోఆపరేటివ్ బ్యాంచ్ శాఖను ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, డీసీసీబీ చైర్మన్ వేచలాపు చినరామునాయుడు శుక్రవారం ఉదయం ప్రారంభించనున్నట్లు కార్యదర్శి బలరాం గురువారం తెలిపారు.

అదనపు భవన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్, పీఎంసీ చైర్మన్

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కోనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు భవనం నిర్మాణానికి స్థానిక సర్పంచ్ బూడి శ్రీరాములనాయుడు, పీఎంసీ చైర్మన్ అక్కునాయుడు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీఎం స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా రూ.15 లక్షల అంచనా విలువతో భవన నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. నాడు–నేడు కింద పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించడం జరిగిందన్నారు. అదనపు భవనం నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం టీవీజీకే మూర్తి, సహపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పైడితల్లమ్మకు ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న పైడితల్లమ్మవారు

గజపతినగరం: మండల కేంద్రంలోని దిగువవీధిలో ఉన్న పైడితల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగించారు. రథసప్తమి సందర్భంగా శుక్రవారం గ్రామంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని మాజీ సర్పంచ్ కందుల చిన్నయ్య, కమిటీ సభ్యులు తెలిపారు.



గుర్ల: జగమ్మ పేరంటాలను దర్శించుకుంటున్న భక్తులు

● గుర్ల: మండలంలోని పెద్దబంటుపల్లిలో జగమ్మ పేరాంటాలు ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకమలతో అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో సుమారు రెండు వేల మంది భక్తులకు ప్రసాదాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కేవీ సూర్యనారాయణరాజు, సర్పంచ్ గెడ్డపు సతీష్, గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మీరు తప్పుచేసి నాపై బురదచల్లడం సరికాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

- గరుడబిల్లిలో అక్రమ తవ్వకాలకు పాల్పడింది టీడీపీ వారే..
- మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేబొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు తనపై చేసిన ఆరోపణలను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తీవ్రంగా ఖండించారు. అవినీతి, అక్రమాలు మీరు చేసి నాపై బురదచల్లడం సరికాదని మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా నిజాయతీగా, నిష్పక్షపాతంగా పనిచేశానని, మీలాగా రాత్రిపూట దొంగతనాలు, దోపిడీలకు, దాడులకు పాల్పడలేదని మండిపడ్డారు. బొండపల్లి మండలం గరుడబిల్లి గ్రామంలోని చెరువు గర్భంలో అక్రమ తవ్వకాలు చేపడుతున్న రెండు జేసీబీలు, 7 ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారని, విచారణలో అక్రమాలకు పాల్పడింది ఎవరనేది తేలిపోతుందని అన్నారు. గరుడబిల్లి చెరువు వద్ద గ్రావెల్, మట్టి తవ్వకాల్లో కిలారి జగదీష్(కొండకరకాం గ్రామం)కు చెందిన ఒక జేసీబీ, 3 ట్రాక్టర్లు, తాత్రాజ్ సత్తిబాబు (గొర్లెపేట)కు చెందిన ఒక జేసీబీ, ట్రాక్టర్, మీసాల పైడిరాజు(కొండకరకాం)కు చెందిన ట్రాక్టర్‌తో మొత్తం 7 వాహనాలు పోలీసులు పట్టుకున్నారని, వీరంతా తెలుగుదేశం పార్టీకి చెందిన వారేనని తగిన ఆధారాలతో వెల్లడించారు. ఇష్టం వచ్చినట్లు దందా చేస్తూ.. తానే వెనక ఉండి నడిపిస్తున్నట్లు ఆరోపణలు చేయడం సరికాదని మండిపడ్డారు. నియోజకవర్గ పర్యటనకు వస్తున్న నారా లోకేష్ వద్ద మెప్పు పొందడం కోసం మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు తామే పోలీష్ స్టేషన్‌కు, మైనింగ్ అధికారులకు టీడీపీ అక్రమార్కులపై ఫిర్యాదు చేసి, అధికారులతో వాహనాలను పట్టించి తాను తీసిన గోతిలో తామే పడ్డట్లు టీడీపీ వారిని ఇరికించి తాను(కె.ఎ.నాయుడు) అడ్డంగా ఇరుక్కుపోయారని అప్పలనరసయ్య ఎద్దేవా చేశారు. తమకు ఇసుక, మట్టి, గ్రావెల్ కావాల్సి వస్తే తగిన పర్మిట్లు తెప్పించుకుని, నిబంధన మేరకు తవ్వకాలు చేపడతామని, మీలా రాత్రిపూట దొంగతనంగా తవ్వకాలు చేపట్టాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికైనా కె.ఎ.నాయుడు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవుపలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, సీనియర్ నాయకులు మండల సురేష్, గిడిజాల కామునాయుడు, కడగల స్వామినాయుడు, మండల లక్ష్మనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి



కళాశాలలో అందుబాటులో ఉన్న వసతులను వివరిస్తున్న ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: పదో తరగతి పాసైన విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్య అభ్యసించేందుకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరుతూ ధర్మవరం హైస్కూల్ ఉపాధ్యాయుల బృందం గురువారం ప్రచారం చేపట్టారు. హెచ్ఎం బి.ఉమామహేశ్వరరావు నేతృత్వంలో ఉపాధ్యాయుల బృందం పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు వెళ్లి అక్కడి విద్యార్థినులకు ధర్మవరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, వసతులను వివరించారు. ఉచిత పుస్తకాలు, డిజిటల్ లైబ్రరీ, ల్యాబ్, తదితర ఎన్నో సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. విద్యార్థినులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలింగ్ కేంద్రంలో వసతులపై ఆరా..



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

వేపాడ: మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని ఇన్‌చార్జి ఎంపీడీఓ జి.ఉమ, ఎంఈఓ–2 బాలభాస్కరరావు గురువారం సందర్శించారు. పోలింగ్ బూత్–96ను సందర్శించి అక్కడి వసతులపై ఆరా తీశారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు, తదితర వాటిపై నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు. మండలంలో 51 పోలింగ్ బూతులను పరిశీలించి అవసరమైన వసతులు కల్పించేందుకు జిల్లా ఎన్నికల అధికారికి నివేదించనున్నట్లు తెలిపారు.

ఆడపిల్లలను చదివిద్దాం..



కళాజాతా ప్రదర్శిస్తున్న నాగరాజు బృందం

వేపాడ: మండల కేంద్రం వేపాడలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'బేటీ బచావో–బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా గురువారం కళాజాతా నిర్వహించారు. ఆతవ అంబేడ్కర్ నాగరాజు బృందంచే ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.కామేశ్వరి నేతృత్వంలో కళాజాతా నిర్వహించారు. బాలికలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని, బాలికలను ఉన్నత చదువులు చదివించాలని, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.